ప్రయాణం.. ప్రాణసంకటం

- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



బండపల్లి ఎస్సీకాలనీ శివారులో వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డు

చందుర్తి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. గుంతలరోడ్లపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని, మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ప్రధాన రహదారి పొడవునా..

కోరుట్ల – వేములవాడ ప్రధాన రహదారి అయిన మండలంలోని లింగంపేట గ్రామం నుంచి రుద్రంగి వరకు రోడ్డు కోతకు గురైంది. హన్మాజిపేట గ్రామ శివారు నుంచి ఎన్గల్, బండపల్లి నుంచి బావుసాయిపేట గ్రామ శివారుకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు భారీ వర్షాలకు కోతకు గురై గుంతలమయంగా మారింది. వర్షాలు తగ్గి నెలరోజులు గడుస్తున్నా రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి కొట్టుకుపోయిన చోట మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బండపల్లి శివారులోని ఎస్సీ కాలనీ శివారులో ఊరచెరువు మత్తడి దూకి ఆర్‌అండ్‌బీ రోడ్డు కొట్టుకుపోయింది. ఈ ప్రాంతంలో ఎదురుగా మరో వాహనం వస్తే వెళ్లడం కష్టంగా మారింది. తారు రోడ్డు కింద మట్టి కూడా కొట్టుకుపోవడంతో వాహనాలు రాకపోకలు సాగిస్తే తారు రోడ్డు ఛిద్రమవుతోంది. లింగంపేట శివారులో తారురోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయి గుంతలమయమైంది. ఈ రహదారిపై రాత్రిపూట వాహనాలు రోడ్డు దిగాలంటే జంకుతున్నారు.

అధ్వానంగా ఎన్గల్–మర్రిగడ్డ రోడ్డు

పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని ఎన్గల్ –మర్రిగడ్డ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపక్కన సైడ్ బర్మ్స్‌కు పోయి మట్టికోతకు గురైంది. రోడ్డుకిరువైపులా గండ్లు పడడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. రెండు మూడేళ్లుగా వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, పంచాయతీ రాజ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

రాత్రిపూట ఇబ్బంది



వర్షాలకు రోడ్లకిరువైపులా మట్టి కొట్టుకుపోయింది. ఎదురుగా వాహనం వస్తే సైడ్ ఇచ్చేందుకు ఇబ్బందిగా ఉంది. రాత్రిపూట ఎదురుగా వచ్చే వాహనాల లైట్లకు గుంతలు ఏర్పడక కింద పడుతున్నారు. కొట్టుకుపోయిన సైడ్ బర్మ్స్ మట్టిని పోయించాలి.

–అంబాల శ్రీకాంత్, బండపల్లి

మరమ్మతులు చేపట్టాలి



వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలి. మండలంలోని అన్ని గ్రామాల మధ్య రోడ్లు దెబ్బతిన్నాయి. రాకపోకలకు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు దిగితే వాహనాలు ఎక్కడ దిగబడుతాయో తెలియని పరిస్థితి.

– మోకినపల్లె జలెందర్, కట్టలింగంపేట

ప్రతిపాదనలు పంపాం

వరద తాకిడితో కొట్టుకుకెళ్లిన రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులకు టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయిస్తాం. పూర్తిగా ప్రమాదకరంగా ఉన్న చోట్ల పనులు చేయించాం.

– శాంతయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, సిరిసిల్ల

క్లుప్తంగా

తైక్వాండోలో బ్లాక్‌బెల్ట్



వేములవాడ: హైదరాబాద్‌లో ఈనెల 13న జరిగిన తైక్వాండో కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో వేములవాడ చెందిన సీనియర్ కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్ బ్లాక్ బెల్ట్ సాధించారు. తైక్వాండో కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రవీణ్‌కుమార్ బ్లాక్ బెల్టును అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ మన్నాన్ మాట్లాడుతూ.. రోజూ వేములవాడలో సినారె కళామందిర్‌లో కరాటే, తైక్వాండో శిక్షనిస్తున్నట్టు ఆయన తెలిపారు విద్యార్థులు ఆత్మరక్షణకు తప్పకుండా కరాటే నేర్చుకోవాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ముస్తాబాద్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. మండలంలోని పోతుగల్‌లో మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని, గుడుంబా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై గణేశ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సింగారంలో పరిసరాల పరిశుభ్రత, సంక్షేమ పథకాలు, డ్రగ్స్, గంజాయి నిషేధంపై కళాకారులు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, గంజాయిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు రుణమాఫీ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిల్ల పర్శరాములు, వంతడుపుల గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పది కాయిన్స్‌ను వినియోగించాలి



బోయినపల్లి: మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహేందర్ ఆధ్వర్యంలో సోమవారం పది రూపాయల కాయిన్స్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పది కాయిన్స్‌ను విరివిగా వినియోగించాలని కోరారు. కాయిన్స్‌పై అపోహలు తొలగించేందుకు మార్కెట్‌లో వీటిని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పలు దుకాణాలు, వ్యాపార సంస్థలకు, కాయిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ క్యాషియర్ వాసు, సిబ్బంది శ్రీధర్ తదితరులు ఉన్నారు.

సన్మానం



రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన గడప వేణు కుమార్, లింగంపెల్లి రవి, శీలం మానస, తర్రె సంగీత డీఎస్సీలో ర్యాంకు సాధించి ఉద్యోగం పొందడంతో సోమవారం రుద్రంగి లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ బండి యాదగిరి, ట్రెజరర్ కొమిరె శంకర్, డిస్ట్రిక్ట్ సపోర్టింగ్ టీం మెంబర్ గడప రఘుపతి రావు, మాజీ అధ్యక్షులు అంబటి శంకర్, కర్నవత్తుల దేవేందర్ రావు, పుట్కపు మహేశ్, మంచె రమేశ్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లకు చెందిన కలకుంట్ల రవి 2024 డీఎస్సీలో ర్యాంకు సాధించి ఉద్యోగం పొందగా సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి దిలీప్ కుమార్, తిక్కల రాజు, జింక సుధాకర్, రాజేంధర్, పులకం మల్లేశం, అనోక్, బొల్లం శ్రీనివాస్, కోల శ్రీనివాస్, గొట్టిముక్కుల శేఖర్, అక్కెనపెల్లి శంకరయ్య, కొమ్ము బీమ శంకర్, గ్రామ పాలక వర్గం, ప్రజలు, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేములవాడ రూరల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఇల్లంతకుంట : సమావేశమైన పూర్వ విద్యార్థులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–2007లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. గురువులు శ్రీనివాస్, సంజీవరెడ్డి, బాలకిషన్‌రావు, శేఖర్, సుధాకర్ రెడ్డి, అంజయ్య గౌడ్, దత్తత్రేయ, మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వెల్జీపూర్ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. పాఠశాలలో చదివిన అప్పటి రోజులను గుర్తుచేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పత్తి శివకుమార్, ఏ రవీందర్ రెడ్డి, కే రాజయ్య, ఆకుల కిషన్, మాజీ సర్పంచ్ ఉడుతల వెంకటేశం, పూర్వ విద్యార్థులు శతి, రేఖ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

కోనరావుపేట: వరంగల్ జిల్లా దేశాయిపేటలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం దుండగులను వెంటనే పట్టుకొని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. మహనీయుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మాసం సుమన్, దొబ్బల అరుణ్, పరశురాం, అజయ్, సదీర్, దిలీప్, రత్నయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం: రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పను ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని వెంకటాపూర్ – రగుడు బైపాస్ రోడ్డుపై రైతులు ధాన్యం కుప్పలు పోశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటకు చెందిన వేముల రాజశేఖర్ (27) బైక్‌పై పెద్దూరు నుంచి చంద్రంపేటకు ఆదివారం రాత్రి వెళ్తుండగా పెద్ద బోనాల- చిన్న బోనాల మధ్య రోడ్డుపై ఉంచిన ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన రాజశేఖర్ పరిస్థితి విషమంగా ఉందని, అన్న వేముల రమేశ్ ఫిర్యాదు మేరకు రోడ్డుపై ధాన్యం పోసిన చిన్న బోనాలకు చెందిన సరుగు భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు



రుద్రంగి : కారు అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... మానాల నుంచి రుద్రంగి వైపు వెళ్తున్న కారు మండలకేంద్రంలోని మానాల క్రాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం రుద్రంగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ వద్ద ఐకేపీ, శ్రీ లక్ష్మి కేశవ పెరుమాండ్ల దేవాలయం, కిష్టంపల్లిలోని సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని 42.50 కిలోల చొప్పున తూకం వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అకాలవర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని, గిద్దె చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చాలని వినతిపత్రంలో కోరారు. రైతులు ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

యువకుడిపై దాడి

వేములవాడఅర్బన్: పట్టణంలోని భగవంతరావునగర్‌లో పెంజర్ల కుమార్ అనే యువకుడిపై ఆదివారం అర్ధరాత్రి పలువురు దాడిచేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భగవంతరావునగర్‌లో ఒకే చోట రెండు దుర్గామాత మండపాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం తర్వాత మండపంలో యువకుల మధ్య జరుగుతున్న గొడవను ఆపేందుకు వెళ్లిన కుమార్‌పై కత్తితో దాడి చేయడంతో మెడ, ముఖం, చేతిపైన గాయాలయ్యాయి. వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స అందించారు. బాధితుడు వేములవాడ పట్టణ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న కౌన్సిలర్ నీరజ

సిరిసిల్లటౌన్: వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను 17వ వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ సోమవారం అందజేశారు. వార్డులోని ఎల్లె శేఖర్ రూ.34,500, యెంజాల లతకు రూ.9వేలు విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారికి అందజేశారు.

ఏఎంసీ డైరెక్టర్లకు సన్మానం



ఎల్లారెడ్డిపేట: ఏఎంసీ డైరెక్టర్లు రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని రెడ్డి ఎంప్లాయీస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (రేపా) సభ్యులు అన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్లు ముత్యాల సత్యంరెడ్డి, కొంగరి కృష్ణారెడ్డి, జంగా శ్రీకాంత్‌రెడ్డి, మర్రి నారాయణరెడ్డి, పొన్నాల తిరుపతిరెడ్డి, గుల్లపల్లి లక్ష్మారెడ్డిని సోమవారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ధాన్యాన్ని లక్ష్యంలోపు తూకం వేసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రేపా సభ్యులు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, కోల బాపురెడ్డి, మోతే దేవిరెడ్డి, దడిగెల లక్ష్మారెడ్డి, గుండాడి వెంకట్‌రెడ్డి, అల్గిరెడ్డి అమరేందర్‌రెడ్డి, వంగ గిరిధర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నిమ్మ నారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

ఇల్లంతకుంట : మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సోమవారం తెలిపారు. గ్రామంలో ఆదివారం దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజేందర్‌పై గ్రామానికి చెందిన గుర్రాల సంతోష్ రెడ్డి, సుమన్‌రెడ్డి, దురుసుగా ప్రవర్తించడంతో వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

పంటల పరిశీలన



ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరులో వరి పంటలను జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె మదన్ మోహన్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు చెరుకు రవీందర్ రెడ్డి ఏరువాక అధికార బృందం పరిశీలించారు.



ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్‌లో పశువైద్యశాల నిర్మాణం రెండేళ్లుగా పూర్తి కావడం లేదు. పాత పశువైద్యశాలను కూల్చివేసిన అధికారులు చెరువు శిఖం భూమిలో వైద్యశాల పనులు రెండేళ్ల క్రితం మొదలు పెట్టారు. స్లాబ్ కోసం సెంట్రింగ్ కొట్టి అలాగే వదిలేశారు. పాత భవనం లేక, కొత్త భవనం నిర్మించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : పంచాయతీరాజ్ ఏఈఈ, ఇనాయతుల్లా, ఫోన్‌నెంబర్ నెంబర్ 9849474383

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

ఆదిని సన్మానించిన సిరిసిల్ల ఆసాములు



ఆది శ్రీనివాస్‌ను గజమాలతో సన్మానిస్తున్న సిరిసిల్ల ఆసాములు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన ఆసాములు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సోమవారం కలిసి గజమాలతో సన్మానించారు. విద్యుత్ సబ్సిడీపై ఆయనకు వివరించగా సమస్యను పరిష్కరిస్తామని విప్ శ్రీనివాస్ హామీ ఇవ్వడంతో ఆసాములు హర్షం వ్యక్తం చేశారు. ఆసాములు సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, నాయకులు మండల రాజు, ఆడెపు సాగర్, సత్యనారాయణ, సుమన్, సదానందం, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణను విరమింజేసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వ్యాపారులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రధాన రహదారిని విస్తరించకుండా పట్టణానికి ఇరువైపులా బైపాస్ రహదారుల నిర్మాణం చేపట్టారన్నారు. ఇప్పటికే పాత ఆంధ్రాబ్యాంక్ ప్రాంతంలో 80 అడుగుల మేర రహదారి ఉన్నా తోపుడు బండ్ల ఆక్రమణతో రోడ్డు ఇరుకుగా మారిందన్నారు.

ఆది శ్రీనివాస్‌ను కలిసిన నూతన అధ్యక్షులు

జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బుస్స దశరథం, వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్దంశెట్టి వేణు సోమవారం మర్యాదపూర్వకంగా ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో కలిశారు. వారిని ఆయన సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి రిమాండ్

వేములవాడఅర్బన్: ఇల్లు నిర్మించనివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపా. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వొటకారి మధు పట్టణ మొదటి బైపాస్ వద్ద సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలనుకున్నాడు. గాంధీనగర్‌కు చెందిన కొండ్లెపు ముత్యం ఇల్లు నిర్మించుకునేందుకు మున్సిపల్ నుంచి అనుమతి ఇప్పిస్తానని మధు వద్ద రూ.59 వేలు తీసుకున్నాడు. పర్మిషన్ ఇప్పించకపోవడంతో మధు మున్సిపల్ కార్యాలయం నుంచి పర్మిషన్ తీసుకొని ఇంటిపనులు మొదలుపెట్టాడు. రూ.2 లక్షలు ఇవ్వాలని, లేదంటే ఇల్లు కట్టుకోనివ్వనని ముత్యం బెదిరించగా మధు రూ.50వేలు ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వాలని బెదిరించగా మధు ఫిర్యాదు మేరకు ముత్యంపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి

బోయినపల్లి: కార్మికవర్గం ఆధ్వర్యంలో ఈనెల 3,4వ తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. రైతుసంఘం అధ్యక్షుడు రామంచ అశోక్, కదుదుల రవి, పొత్తూరి నర్సయ్య, అలువాల అంజయ్య, లచ్చయ్య తదితరులున్నారు.

● నియామకం

ఇల్లంతకుంట : మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా బట్టి చంద్రమౌళిని నియమిస్తూ సోమవారం రాష్ట్ర ఫోరం చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర ఫోరం ముఖ్య సలహాదారు ఒరగంటి ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం 4గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	10	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	04	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	09	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	02	448
పార్వతీపురం స్పెషల్	12	672
పార్వతీపురం సాధారణ	08	336

- వేములవాడ

తుంగభద్ర నదిలో దుర్గామాత నిమజ్జనం



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని జోగులాంబ గద్వాల సన్నిధిలోని తుంగభద్ర నదిలో సోమవారం నిమజ్జనం చేశారు. ఆదివారం రాత్రి ప్రత్యేక వాహనంలో అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి తుంగభద్ర పుణ్య నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జవ్వాజి సంజీవ్, నంది నరేశ్, క్రాంతి, లక్ష్మణ్, బాధ రమేశ్, శ్యామ సాయి, దుబ్బ శ్రీనివాస్, వడ్నాల దేవేందర్, చందుపట్ల రాజిరెడ్డి, నేవూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు. చివరి రోజు భక్తులు మండపంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. శోభాయాత్రలో యువతులు దాండియా, కోలాటం ఆడారు. ఎస్సై ఎల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ నాయకులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలో జరిపి వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ యూత్ నాయకులు చిలివేరి చిరంజీవి, సయ్యద్ అఫ్రోజ్, బండి శ్రీనివాస్, మహిపాల్, బాబు, కృష్ణ, శ్రీకాంత్, వినోద్, వేణు, రాకేశ్, వంశీ, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.